ప్రజాశక్తి

ఆదివారం 3 డిసెంబర్ 2023

5

అల్లూరి సీతారామరాజు

దీక్షా శిబిరాన్ని సందర్శించిన డిఎం అండ్ హెచ్ఒ

ప్రజాశక్తి-పాడేరు: ఐటీడీఏ ఎదుట కమ్యూనిటి హెల్త్ వర్కర్స్ తమ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ చేపట్టిన దీక్షలు శనివారం 8 వ రోజు కొనసాగాయి. ఈ దీక్షా శిబిరాన్ని డిఎం అండ్ హెచ్ఓ జమాల్ భాష సందర్శించారు. ఈ సందర్భంగా సిహెచ్‌డబ్ల్యుల సమస్యలను ఉన్నతాధికారులకు తెలియ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతమ్మ, చిన్ని, కాంతమ్మ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మన్ పడాల్ పాల్గొన్నారు.

సిహెచ్‌డబ్ల్యులతో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఒ

మిరియాల రైతులకు గిట్టుబాటు ధర

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: మిరియాలు సాగు చేస్తున్న గిరిజన రైతులకు మంచి గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా సేవలందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. సేంద్రీయ పద్ధతిలో ఏజెన్సీలో శ్రేష్టమైన నల్ల మిరియాలను గిరిజనులు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. గిరిజన రైతుల ఆదాయం పెంచి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలన్నారు. స్పైసెస్ బోర్డు అధికారులుతో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి శనివారం వర్చువల్ విధానంలో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో గిరిజన రైతులు అత్యధికంగా వరి, పసుపు, రాజ్మా, అల్లం, చిరుధాన్యాలు, ఉద్యాన వన పంటలు కాఫీ, మిరియాల పంటలను సాగు చేస్తున్నారని చెప్పారు. స్పైసెస్ బోర్డును బలోపేతం చేసి, తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. మిరియాలు పండిస్తున్న రైతులకు బ్రాండింగ్, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. గిరిజన ప్రాంతంలో సుమారు రూ.500 కోట్ల విలువైన మిరియాల ఉత్పత్తులు జరుగుతున్నాయని చెప్పారు. ఇందుకు తగిన స్థాయిలో ప్రభుత్వ యంత్రాంగం మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసారు. సుగంధ ద్రవ్యాల సాగుకు పెట్టుబడులు పెడితే రైతులకు ఆదాయం పెరిగి, ఆర్థిక భద్రత పెరుగుతుందని పేర్కొన్నారు. కాఫీ, మిరియాలు క్రయ, విక్రయాలు, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి గ్రామ వ్యవసాయ, ఉద్యాన వన సహాయకులకు అవసరమైన శిక్షణా తరగతులు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

స్పైసెస్ బోర్డు సహాయ సంచాలకలు కులదీప్ రాయ్, విజీష్న మాట్లాడుతూచ ఎస్‌టిడిఎఫ్ ప్రాజెక్టులో భాగంగా కాఫీ, మిరియాల రైతులకు ఉపయోగ పడే విధంగా అల్యూమినియం నిచ్చెనలు, మిరియాల నూర్పిడి యంత్రాలు పంపిణీ చేసామన్నారు. గిరిజన రైతులకు 20 వేల మిరియాల మొక్కలు, టార్పాలిన్లు అందజేసామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్ .నంద్, జిల్లా ఉద్యానవన అధికారి ఎ.రమేష్ కుమార్‌రావు, స్పైసెస్ బోర్డు సీనియర్ క్షేత్ర స్థాయి అధికారి బొడ్డు కళ్యాణి, కాఫీ బోర్డు ఉప సంచాలకులు రమేష్, స్పైసెస్ బోర్డు సహాయ సంచాలకులు విజీష, ఆహార, వ్యవసాయ సంస్థ నేషనల్ ప్రాజెక్టు మేనేజర్ వినియ్ సింగ్, డిపిఎం భాస్కరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

పాడేరు నుంచి భద్రాచలానికి

ఆర్‌టిసి బస్సు సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు నుంచి తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి ఆర్టీసీ ఎక్స్ ప్రెస్ సర్వీసును జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శనివారం ప్రారంభించారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే తొలి టికెట్ తీసుకొని ప్రయాణం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి గ్రామానికి ఆర్టీసీ సర్వీస్‌లను వేస్తున్నామని, దీనిలో భాగంగా నాలుగైదు ప్రాంతాలకు ఇది వరకు కొత్త సర్వీసులు ప్రారంభించినట్లు తెలిపారు. ఉదయం 11:30 గంటలకు పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఈ బస్సు బయలుదేరి 12:40 నిమిషాలకు అరకు చేరుకుంటుందని, అక్కడి నుంచి మధ్యాహ్నం ఒంటిగంటకు బయలుదేరి పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ మధ్యాహ్నం రెండు గంటలకు చేరుకుంటుందన్నారు. ఇక్కడి నుంచి బయలుదేరి చింతపల్లి, సీలేరు, డొంకరాయి, చింతూరు, కూనవరం, నెల్లిపాక మీదుగా రాత్రి 11 గంటలకు భద్రాచలం చేరుకుంటుందంటారు. మరుసటి రోజు ఉదయం ఏడు గంటలకు భద్రాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 3:45 నిమిషాలకు పాడేరు చేరుకుంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సిపి మండల అధ్యక్షులు సీదరి రాంబాబు, జిల్లా కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, ఏఎంసీ చైర్మన్ కూతంగి సూరిబాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎస్ దశమూర్తి, పి.సత్యనారాయణ, సర్పంచుల ఫోరం అధ్యక్షులు బసవన్న దొర సర్పంచులు, వైస్సార్సీపీ సోషల్ మీడియా కన్వీనర్ అల్లాడ నగేష్ పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఏకలవ్య మోడల్ పాఠశాల నూతన భవనాన్ని పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

నాణ్యతతో నిర్మాణాలు చేపట్టాలి

రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వం చేపట్టిన వివిధ నూతన భవనాలను నాణ్యతతో నిర్మాణం చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలో శనివారం ఆయన ఆకస్మికంగా పర్యటించి, వివిధ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతనంగా నిర్మిస్తున్న భవనాలను పరిశీలించిన ఆయన నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. పిహెచ్‌సిని సందర్శించిన పిఒ, ఇన్ పేషెంట్స్, అవుట్ పేషెంట్స్ వివరాలు, గర్భిణుల ప్రసవాలు తదితర అడిగి తెలుసుకున్నారు. మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి మౌలిక సదుపాయాలు, తరగతి గదులు, మెనూ వంటి అంశాలను పరిశీలించారు. సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. మారేడుమిల్లి గ్రామ సమీపంలోని హెయన్టిసిలో హార్టికల్చర్ పనులు ఏవిధంగా నిర్వహిస్తున్నారో పరిశీలించారు. మారేడుమిల్లి మార్కెట్‌ను సందర్శించి, ఇంకా అభివృద్ధి చేసే విధంగా ఏమి కావాలో నివేదికలు సమర్పించాలని ఎంపీడీవోను పిఒ ఆదేశించారు. బొదులూరు గ్రామం నుండి చట్లవాడ గ్రామం వరకు సుమారు 8 కిలోమీటర్ల రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. పిఒ వెంట తహశీల్దారు ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో వీర కిషోర్, మారేడుమిల్లి పంచాయతీ సర్పంచ్ కొండ జాకోబ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సాయి సతీష్, చైతన్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు భాను, ప్రదీప్ తదితరులున్నారు.

గంజాయి సాగు చేస్తే కఠిన శిక్షలు

ప్రజాశక్తి -అరకులోయరూరల్: మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం గంజాయి, నాటు సారా కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అరకు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ గణపతి బాబు మాట్లాడుతూ, గిరిజనులు గంజాయి సాగుతో డబ్బులకు ఆశపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని చెప్పారు. రవాణా చేసి దొరికితే బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని చెప్పారు.

డుంబ్రిగుడ ఎస్సై సంతోష్ కుమార్ మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలు ఉపయోగించి తమ ప్రాణాలను సైతం కోల్పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ పోలీస్‌లు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: అరకు ఎక్స్చేంజ్ శాఖ, డుంబ్రిగూడ పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గంజాయి, నాటు సారాతో అనర్థాలపై శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరకు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ గణపతి బాబు మాట్లాడుతూ, గంజాయితో పట్టుబడితే కఠిన శిక్షలు ఉంటాయన్నారు.

మాట్లాడుతున్న సిఐ

నినాదాలు చేస్తున్న వెలుగు సిబ్బంది

బాల్య వివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల మహిళ సమాఖ్య ఏపీఎం ఎ.దేవామం తెలిపారు. మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా మహిళా సంఘం ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాలు అరికట్టాలని పలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ, బాల్య వివాహాలతో పుట్టే పిల్లలు రక్తహీనత, పలు లోపాలతో జన్మిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసి భవాని, ఆర్.జగదాంబ, డ్వాక్రా మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కందులూరు- టేకులూరు మట్టి రోడ్డును పరిశీలిస్తున్న ఎంపిపి, సిపిఎం నేతలు

కుందులూరు-టేకులూరు

రహదారి నిర్మాణం తక్షణమే చేపట్టాలి

- ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలంలోని కుందులూరు మీదుగా టేకులూరు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణం తక్షణమే చేపట్టాలని ఎంపిపి కారం లక్ష్మి డిమాండ్ చేశారు. ఎంపిపి లక్ష్మి, సిపిఎం బృందం శనివారం కందులూరు–టేకులూరు మట్టి రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మార్గంలో వాహనాలు, అంబులెన్స్‌లు వచ్చే పరిస్థితి లేదని, కనీసం ఆటోలు కూడా రాకపోకలకు వీలుగా ఈ రహదారి లేదని తెలిపారు. దీంతో టేకులూరు నుండి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ఆసుపత్రికి వెళ్లాలన్నా, నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలన్నా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ రహదారికి నిధులు మంజూరైనా నిర్మాణం చేపట్టలేదని, గిరిజన గ్రామం పట్ల ఇంత నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. అనంతరం టేకులూరులోని అంగన్వాడీ కేంద్రం, ఎంపీపీ స్కూల్‌ను పరిశీలించారు. చిన్నపిల్లలకు ఎంపీపీ చేతుల మీదుగా టీకాలు వేయించారు. అనంతరం ఎంపిపి లక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ భవనం శిథిలావస్థలో ఉందని, వెంటనే నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని కోరారు. పూర్వకాలం నుండి పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు పోడు పట్టాలు ఇవ్వడం లేదని, దీనిపై మూడు నాలుగు సార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవట్లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు పంకు సత్తిబాబు, లక్ష్మణరావు, తెల్లం కన్నారావు, తెల్లం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు శిక్షణ

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని 23 గ్రామ సచివాలయాల సిబ్బందికి, ఆయా పరిధిలోని గ్రామ వాలంటీర్లకు ఈ నెల 4 నుండి 9వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లాలం సీతయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీవో, వెలుగు కార్యాలయాల సమావేశ మందిరాల్లో ఈ శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని, సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు శిక్షణకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

ఉద్యోగుల మానసిక స్థితి మెరుగుకు శిక్షణ

ప్రజాశక్తి -సీలేరు

ఉద్యోగుల మానసిక స్థితిని మెరుగుపరచడానికి శిక్షణా తరగతులు నిర్వహించినట్లు ఏపీ జెన్కో ఇంజనీర్ నాగభూషణం వెల్లడించారు. జీకే వీధి మండలం సీలేరు ఏపీ జెన్కో కళ్యాణ మండపంలో శుక్ర, శనివారాల్లో జరిగిన విద్యుత్ ఉద్యోగులకు శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. శిక్షణ తరగతుల వలన ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుస్తాయన్నారు. సంస్థ అభివృద్ధిలో ఉద్యోగులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. నెల్లూరు, శ్రీశైలం, నాగార్జునసాగర్, మోతుగూడెం, సీలేరు పరిధిలోని సుమారు 1200 మంది విద్యుత్ ఉద్యోగులు ఈ శిక్షణకు హాజరు కాగా, వ్యక్తిత్వ వికాస నిపుణులు గంప నాగేశ్వరరావు, భాస్కరరావు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ కేకేవి.ప్రశాంత్ కుమార్, ఈఈ లక్ష్మీనారాయణ, మెకానికల్ ఏడి ఈ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఎపి జెన్‌కో ఉద్యోగులకు మానసిక వికాసంపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

సమస్యలు లేవ నెత్తుతున సభ్యులు

సమస్యలపై ప్రజాప్రతినిధుల గళం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలో ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ సమావేశం సాఫీగా సాగింది. సర్వసభ సమావేశం జరగనున్న ఒకరోజు ముందు మాత్రమే సర్పంచులు, ఎంపీటీసీలకు తెలియజేడయం ఏమిటని ఎంపీడీవో జై సాగర్ ను నిలదీశారు. ఆయన బదులిస్తూ ఈసారి అలా కాకుండా 15 రోజులు ముందే నోటీసులు ఇచ్చే ఏర్పాటు చేస్తానని తెలిపారు. లువాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసి దొర మాట్లాడుతూ, సర్వసర సమావేశంలో సమస్యలను అధికారులు రాసుకుని తీర్మానం చేయడం తప్ప సమస్యలు తీర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. పాలమామిడి సర్పంచ్ రామకృష్ణ మాట్లాడుతూ, సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది విధులకు క్రమంగా హాజరు కాలేదని, ఒకవేళ వచ్చినా ప్రజలకు అందుబాటులో ఉండలేదన్నారు. బోయితిలి సర్పంచ్ మాలన్న మాట్లాడుతూ, మడత కొండ గ్రామంలో పాఠశాల భవనం లేక విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని, నూతన పాఠశాల భవన నిర్మాణం చేపట్టాలని అధికారులకు తెలిపారు. జిమాడుగుల సర్పంచ్ రాంబాబు మాట్లాడుతూ, పలు ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రోడ్లపై తిరుగుతుంటే ఉపాధ్యాయులు, వార్డెన్లు ఏమి చేస్తున్నట్టు అని ఏటిడబ్ల్యూఓని నిలదీశారు. స్థానిక ఎంపీపీ కొర్ర పద్మ మాట్లాడుతూ, సర్వసభ సమావేశం జరిగినప్పుడు మాత్రమే అధికారులు పుస్తకాల్లో సమస్యలు రాసుకుంటున్నారే తప్ప తీర్చే విధంగా కృషి చేయలేదని ఆమె ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ పాల్గొన్నారు

నగదును ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

యుటిఎఫ్ నేతల సహాయం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని బీరం గ్రామంలో జిపిఎస్(టిడబ్ల్యూ) పాఠశాలలో మూడో తరగతి విద్యార్థిని సాహితీ ప్రియ అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. కుటుంబ సభ్యులను మండల యుటిఎఫ్ నేతలు పరామర్శించారు. బాధిత కుటుంబీకులకు నుర్మతి స్కూల్ కాంప్లెక్స్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు బి. రూపవతి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, కళారావు, ఈశ్వర నాయుడు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అన్నదాతల్లో తుపాను భయం

కోత కోసిన వరి పంట కుప్పలుగా పెట్టే పనుల్లో బిజీబిజీ

ప్రజాశక్తి-విఆర్.పురం

తీవ్ర వర్షా భావ పరిస్థితులను ఎదుర్కొని వరి పంటను సాగు చేసిన రైతులకు తుపాన్ కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. రానున్న రెండు మూడు రోజుల్లో తుపాన్ కారణంగా భారీగా వర్షాలు పడే సూచనలున్నాయని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కోత కోసిన పంటను రక్షించుకునేందుకు రైతులు పొలాల్లో పరుగులు పెడుతున్నారు. మండలంలోని రైతులు సుమారు 4,191 హెక్టర్లలో వరి సాగు చేశారు. వర్షా భావ పరిస్థితుల్లోనూ పంటను రక్షించుకున్నారు. నేడు వరి పంట కోత దశకు వచ్చింది. ఇప్పటికే మండలంలో కొన్ని ప్రాంతాల్లో వరి చేలు కోతలు కోసి ఫనలను ఆరబెట్టారు. మరికొన్ని కొన్ని చేలు కోతకు సిద్ధంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వరుణుడు తుపాన్ రూపంలో వస్తే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో రైతులు కోసిన పంటను కుప్పలుగా పెడుతున్నారు. అయితే సరిగా ఎండకుండా కుప్పలు పెడితే ధాన్యం నాణ్యత దెబ్బతింటుందని భయపడుతున్నారు. అలాగే పొలంలో పండిపోయి ఉన్న పంట కూడా తుపాన్‌కు దెబ్బతినే అవకాశం ఉందని గుబులు చెందుతున్నారు. ఇప్పటకే అధిక పెట్టుబడులు పెట్టామని, పంట చేతికి వచ్చే సమయంలో ఇలా తుపాన్ రావడంతో రైతులు దిక్కు తొచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

పొలంలో వరి పంటను కుప్పలు పెట్టే పనుల్లో ఉన్న రైతులు

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కొయ్యూరు : రానున్న రెండు మూడు రోజుల్లో ఏఎస్ఆర్ జిల్లాలో భారీగా వర్షాలు పడే సూచన ఉన్న నేపథ్యంలో రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఉమాదేవి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. మండలంలోని రైతులందరూ వరి పంట కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. మండలంలో సుమారు 5100 ఎకరాల్లో వరి పంట సాగు అయిందని, అందులో దాదాపుగా 3500 ఎకరాలు కోతకు సిద్ధంగా ఉన్నదని తెలిపారు. ఇప్పటికే మండలంలో సుమారు 450 ఎకరాల వరకు వరి కోతలు అయ్యాయని, ఆ పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వరి కుప్పలు తడవకుండా పరదాలతో రక్షించుకోవాలన్నారు. వర్షాలకు తడిస్తే వరి గింజలు మొలక రాకుండా ఉండడానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని ఫనలపై చల్లాలని సూచించారు.

దోపిడీ విముక్తి పోరులో భాగస్వామ్యం కావాలి

పిడిఎస్‌యు జిల్లా మహాసభలో విద్యార్థులకు టాన్య పిలుపు

ప్రజాశక్తి-రంపచోడవరం

దేశంలో కొనసాగుతున్న దోపిడీ నుండి విముక్తి కోసం జరిగే పోరాటంలో విద్యార్థులు కూడా భాగస్వాములు కావాలని సిపిఐఎంఎల్ (న్యూ డెమోక్రసీ) కేంద్ర కమిటీ నాయకులు పి.టాన్య పిలుపునిచ్చారు. పిడిఎస్‌యు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 21వ మహాసభ శనివారం రంపచోడవరంలోని జూనియర్ కళాశాల ఆవరణలో సంఘం జిల్లా అధ్యక్షులు వి.మయూరి అధ్యక్షతన శనివారం జరిగింది. ముందుగా విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల ఆవరణలో పిడిఎస్‌యు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో టాన్య మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగిన జాతీయ ఉద్యమాలలో వేలాది మంది విద్యార్థులు చదువులు సైతం పక్కనపెట్టి పాల్గొన్నారని, తమ విలువైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని గుర్తు చేశారు. నేడు దేశంలో హిందూ ఫాసిస్టు శక్తులు అధికారంలో ఉండి పెట్రేగిపోతున్నాయని, మరో వైపు దేశ సంపదను సామ్రాజ్యవాద, కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా మన్యం వీరుడు అల్లూరి, విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వంటి వారి స్ఫూర్తితో పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు యు.గనిరాజు మాట్లాడుతూ కేంద్రం మోడీ, రాష్ట్రంలో జగన్ సర్కార్లు ప్రభుత్వ విద్యా రంగాన్ని ధ్వంసం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ కిరణ్ కుమార్, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వరరావు, పివైఎల్ రాష్ట్ర కార్యదర్శి వి.చిట్టిబాబు, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు కె.బాల్‌రెడ్డి, అరుణోదయ జిల్లా కార్యదర్శి ఎ.భాను శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు, చిత్రంలో టాన్య తదితరులు

పింఛన్లు పంపిణీచేస్తున్న నాయకులు

నూతన పింఛన్లు అందజేత

ప్రజాశక్తి- హుకుంపేట: మండలం సూకూరు పంచాయతీ బిరిసింగి గ్రామం లో పుట్టుక తో వికలాంగుడైన వంతాల బుజ్జిబాబు కు రు.3000/-లు పెన్షన్ జడ్పీటీసీ రేగం మత్స్య లింగం, ఎంపీటీసీ లాగాడ సింహాచలం, సర్పంచ్ సత్యవతి చేతుల మీదుగా శనివారం అందించారు. అనంతరం జడ్పిటిసి రేగం మత్స్యలింగం మాట్లాడుతూ, పుట్టుకతో అంగవైకల్యం ఉన్నా పెన్షన్ కోసం ఎన్ని సార్లు దరఖాస్తు పెట్టుకున్నా తిరస్కరించే వార న్నారు. ఈ విషయమై మండలంలో జరిగిన స్పందనలో కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ హామి మేరకు పింఛను మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు ధనసాని మురళి, కిల్లో చిన్నేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- అనంతగిరి:మండలంలో ఉన్న ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహల వద్ద మోటార్ ఫీల్డ్ యూనియన్ కార్మికులు నూతన కార్యవరం ఎన్నికైంది. అధ్యక్షులుగా డుంబరి శ్యామ్ ఎన్ని కాగా నూతన కార్యవర్గం ఏర్పాటు అయ్యింది. ముఖ్య అతిథిగా అనంతగిరి సబ్ ఇన్స్పెక్టర్ కే.రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్క కార్మికులు చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించవద్దని తెలిపారు. రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారిని డ్రైవర్గా ఎక్కించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బొర్రా మోటర్ యూనియన్ మాజీ అధ్యక్షులు సుభాకర్, రాంబాబు పాల్గొన్నారు.

కిట్లు అందిస్తున్న ఎస్ఐ సంతోష్‌కుమార్

వాలీబాల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎస్సై సంతోష్‌కుమార్ శనివారం పోలీస్ స్టేషన్‌లో వాలీబాల్ కిట్టును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చెడు వ్యసనలకు దూరంగా ఉండాలన్నారు. క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నివేదిక

సెక్టోరల్ అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం

మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా వ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి నివేదికలు అందజేయాలని సెక్టోరల్ అధికారులను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ ఆదేశించారు. శనివారం జిల్లాలోని సెక్టోరల్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 352 సచివాలయాలలో 66 సచివాలయాలు రాష్ట్ర సరిహద్దులలో ఉన్నాయని, అటువంటి వాటిపై దృష్టి సారించాలన్నారు.గత ఎన్నికలలో జరిగిన అవాంచనీయ సంఘటనలు, సమస్యలపై ఆరా తీసి నివేదికలు అందజేయాలని వివరించారు. సమస్యలున్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి 45 రోజులలోపు నిర్ణీత ప్రొఫార్మాలో నివేదికలు అందజేయాలని సూచించారు. తప్పుడు నివేదికలు అందిస్తే సంబంధిత సెక్టోరల్ అధికారి భాద్యత వహించవలసి వస్తుందని హెచ్చరించారు.

ఎస్పి తుహిన్ సిన్హా మాట్లాడుతూ, సెక్టోరల్ అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలనకు మారుమూల గ్రామాలకు వెళ్ళినప్పుడు ముందుగా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులుచ జేసి జే.శివ శ్రీనివాసు, పిఓ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ శుభం బన్సాల్, డిఆర్ఓ పి.అంబేద్కర్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

'అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం'

ప్రజాశక్తి- చింతపల్లి: అభివృద్ధి, సంక్షేమాలు రెండు నేత్రాలుగా గడచిన నాలుగున్నరేళ్ళుగా రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎర్రబొమ్మల పంచాయితీ సర్పంచ్ లోతా పండయ్య ఆధ్వర్యంలో రోలంగి గ్రామంలో శనివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్ గెమ్మెల సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైకాపా ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి నేటి వరకు అభివద్ధి, సంక్షేమాలను రెండు నేత్రాలుగా భావించి రాజకీయ పార్టీలకతీతంగా ప్రతి కుటుంబానికి మేలు చేసిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు గహ సారధులు కన్వీనర్లు కషి చేయాలని పిలుపునిచ్చారు. వైకాపా ప్రభుత్వంలో చేసిన అభివద్ధిని, అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించవలసిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. వైకాపా ప్రభుత్వంలో చేసిన ప్రతి సంక్షేమాన్ని గడపగడపకు వెళ్లి అవగాహన కల్పించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. 500కోట్లతో పాడేరులో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాంగి గుణ బాబు, వైస్ సర్పంచ్ సెగ్గె సోమరాజు, పార్టీ నాయకులు కొర్రా శీమన్ కుమార్, సచివాలయ కన్వీనర్ కొర్రా బాలరాజు,పాంగి రాజేష్,బాకూరు బాలరాజు, వెలుసూరి సింహాచలం, గహ సారధులు, కన్వీనర్లు, గ్రామస్తులు, వాలంటరీలు పాల్గొన్నారు.

హాజరైన నాయకులు

ఆశా కార్యకర్తల తాత్కాలిక జాబితా విడుదల

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో ఆశా కార్యకర్తల భర్తీకి తాత్కాలిక జాబితా విడుదల చేసి వెబ్ సైట్ నందు పొందుపరచడమైందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ బాష ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాపై అనుమానాలు, అపోహలు ఉన్న వారు సంబందిత పి.హెచ్.సి మెడికల్ ఆఫీసర్‌కు స్వయంగా ఫిర్యాదును ఈనెల 5వ తేదీలోపు అందజేయవచ్చని సూచించారు. గడువు ముగింపు తర్వాత వచ్చిన ఫిర్యాదులు స్వీకరించబడవని స్పష్టం చేసారు.

ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్

మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని కించాయి పంచాయతీ గ్రామ సచివాలయంలో శనివారం ప్రత్యేకంగా ఓటర్లు నమోదును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ నర్సమ్మ మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కు నమోదుకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఓటర్ నమోదు కేంద్రాలను సిపిఎం నేతలు పరిశీలించారు.ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శిపాంగి భీమరాజు మాట్లాడుతూ, కించాయిపుట్ పంచాయతీ గుమ్మ సిరాగంపుట్ గ్రామానికి చెందిన 90 ఓట్లు పనసపుట్ పంచాయతీ బూత్‌లో కలిశాయన్నారు. దీంతో గుమ్మసిరంపుట్ ఓటర్లు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, లక్ష్మీపురం సర్పంచ్, మండల కమిటీ సభ్యుడు ఎం ఎం శ్రీను, గిరిజన సంఘం మండల కార్యదర్శి కొర్ర నర్సయ్య,కొర్ర ధర్మారావు తెలిపారు.

నేరాలు ఘోరాలు

దుప్పటి ఇవ్వలేదని హత్య

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక చట్టివానిపాలెంలో దుప్పటి ఇవ్వలేదని యువకుడిని తోటి స్నేహితులు హత్య చేసిన ఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. దీనికి సంబంధించి గాజువాక పోలీసుల కథనం ప్రకారం... శ్రీకాకుళం జిల్లాకు చెందిన కిరణ్ (35), స్నేహితులు కె.శ్రీరాములు, ఎస్.మోహన్ కలిసి స్క్రాప్ వ్యాపారం చేస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి చట్టివానిపాలెంలో రోడ్డు పక్కన వీరు పడుకున్నారు. కిరణ్ దుప్పటి ఇవ్వలేదని ముగ్గురి మధ్య గొడవ జరిగింది. దీంతో స్నేహితులు శ్రీరాములు మోహన్ కలిసి కిరణ్ నుదుటిపై రాయితో కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బీట్‌లో ఉన్న పోలీసులు గమనించి వెంబడించి వారిని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని ఒడ్డిమెట్ట జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ విభూషణరావు తెలిపారు. గుంటూరు నుంచి శ్రీకాకుళం సోనాలిక షోరూంకు తీసుకు వెళ్తున్న క్రొత్త ట్రాక్టర్‌ను వెనుక నుంచి వస్తున్న ఐచర్ వ్యాన్ డీ కొట్టడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం మాచవరం గ్రామానికి చెందిన బండి భాస్కర్ రెడ్డి (42) మృతి చెందాడు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి -జి.మాడుగుల: ఈనెల 2 తేదీ నుండి మావోయిస్టుల వారోత్సవాల జరుగుతున్న నేపథ్యంలో స్థానిక సిఐ రమేష్, ఎస్సై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు పలుచోట్ల వాహన తనిఖీలను నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ రమేష్ మాట్లాడుతూ,వాహనదారులు రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు. పరిమితికి మించి జీపులు, ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు.

ముంచింగిపుట్టు: వారోత్సవాల నేపథ్యంలో మండల కేంద్రంలో వారపు సంతలో ఎస్సై రవీంద్ర వాహనాల తనిఖీలను చేపట్టారు. ప్రయాణికుల బ్యాగులను తనిఖీలు చేశారు.వారోత్సవాలు పూర్తయ్యే వరకు అధికారులు, రాజకీయ నేతలు మారుమూల ప్రాంతాలకు వెళ్ళరాదని ఎస్సై రవీంద్ర సూచించారు.

వెటరన్ క్రీడాకారుడు జయరామ్ కన్నుమూత

ప్రజాశక్తి -భీమునిపట్నం : తొలితరం వెటరన్ క్రీడాకారుడు, జివిఎంసి మూడో వార్డుకు చెందిన కోనాడ జయరామ్ (78) శుక్రవారం సాయంత్రం కన్ను మూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న జయరామ్ ఇంటి వద్దనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మాజీ కౌన్సిలర్ ఎం.లక్ష్మణరావు తది తరులు అతని భౌతిక కాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. ఎంతో మందిని వెటరన్ క్రీడాకారులుగా తీర్చిదిద్దారని కొనియాడారు.

ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

'బాబు ష్యూరిటీ'పై ప్రచారం

ప్రజాశక్తి - కొయ్యూరు : మండలంలోని అడాకుల పంచాయితీ పరిధిలో టిడిపి యూనిట్ ఇన్‌చార్జి కూనిశెట్టి సత్తిబాబు, బూత్ కన్వీనర్ కూనిశెట్టి జోగారావు ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, నాయకులు వి.స్వామి నాయుడు, కూనిశెట్టి అప్పారావు, జంపా వెంకటరమణ, లోతా సింహాచలం, పాంగి భీమరాజు పాల్గొన్నారు. బాలారం పంచాయతీ పరిధి మల్లవరం గ్రామంలో నిర్వహించిన బాబు షూరిటీ కార్యక్రమంలో టిడిపి నాయకులు బంటు లక్ష్మణ్, గ్రామస్తులు జంప చిన్నబ్బాయి, భీమరాజు జోగిరాజు, లక్ష్మి పాల్గొన్నారు.

ఎనీమియా వ్యాధిగ్రస్తులకు సహాయం

ప్రజాశక్తి - సీలేరు : ఎనీమియాతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం రూ.10వేలు చొప్పున మంజూరు సొమ్మును లబ్ధిదారులకు శనివారం అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ వెల్లడించారు. సీలేరు పంచాయతీ పరిధి అల్లూరు వీధిలో కిల్లో రితీష్, దుర్గావీధికి చెందిన మండి మారికి శనివారం సీలేరు సచివాలయంలో జీకే వీధి యుఓపిఆర్డి పాపారావు, స్థానిక సర్పంచి దుర్జు, ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ గుమస్తా ప్రకాష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి పథకం బోరు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - సీలేరు : జల్ జీవన్ మిషన్ పథకం కింద జికె.వీధి మండలం సీలేరు మేజరు పంచాయతీ పరిధి పార్వతి నగర్‌లో మంచి నీటి పథకానికి సంబంధించి బోరు నిర్మాణ పనులను పంచాయతీ సర్పంచ్ దుర్జో శనవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గత కొంతకాలంగా పూర్తిస్థాయిలో మంచినీటి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు గురవుతున్నారని, జల్ జీవన్ పథకం ద్వారా తాగునీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు.

గిరిజన మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఎంవిఆర్ గ్రూప్ వారి సహకారంతో మారేడుమిల్లి మండలం పాములేరు గ్రామంలో వనవాసి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యానటైలరింగ్ వృత్తిలో ఉచిత శిక్షణకు మహిళలను ఎంపిక చేశారు. వీరికి వృత్తిలో శిక్షణ వచ్చి సర్టిఫికెట్లు అందించనున్నట్లు వనవాసి సంస్థల డైరెక్టర్ గొర్లె అనుదీప్ కుమార్, మేనేజర్ విజయకుమార్ చెప్పారు. త్వరలో ఈ శిక్షణ కార్యక్రమం గ్రూపుల వారీగా జరుగుతుందని, ఆసక్తి గలవారు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

క్రీడా పోటీల్లో యువత పాల్గొనేలా ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - కొయ్యూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమంలో ఎక్కువ మంది యువత పాల్గొనేలా తగు చర్యలు చేపట్టాలని ఎంపీపీ బడుగు రమేష్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు దీనిపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లాలం సీతయ్య పాల్గొన్నారు.

జగన్ పెద్ద అవినీతిపరుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెద్ద అవినీతిపరుడని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. శనివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రుషికొండ విధ్వంసంపై వైసిపి మినహా అందరూ పోరాటం చేస్తున్నారని తెలిపారు.

8 వరకు పిఎల్‌జిఏ వారోత్సవాలు

పోలీసుల అప్రమత్తం - విస్తృతంగా తనిఖీలు
విశాఖ- సీలేరు, భద్రాచలం నైట్ సర్వీసు బస్సులు రద్దు

ప్రజాశక్తి -సీలేరు

మావోయిస్టు పార్టీ పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పిఎల్‌జిఎ) వారోత్సవాలు ఈనెల 2 నుంచి 8 వరకు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మావోయిస్టులు తమ ఉనికిని చాటుకునేందుకు పలు విధ్వంసానికి పాల్పడతారని ఇంటెలిజెన్సీ వర్గాలు హెచ్చరికలు నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో భారీగా పోలీస్ బలగాలని మొహరించి విస్తృతంగా తనిఖీ నిర్వహిస్తున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో స్థానిక ఎస్సై రామకృష్ణ శనివారం పోలీస్ బలగాలతో కూంబింగ్ చేపట్టారు. మావోయిస్టు కదిరిపై నిఘాపెట్టి ఆరా తీశారు. అపరిచిత వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించారు. పిఎల్‌జిఎ వారోత్సవాలు నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు అప్రమత్తమై విశాఖ నుండి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నైట్ బస్ సర్వీసులను ఈనెల 2 నుంచి 8 వరకు రద్దు చేశారు.

కొయ్యూరు : పీఎల్జీఏ వారోత్సవాల నేపథ్యంలో కొయ్యూరు మండలంలో శనివారం ఎస్సై రాజారావు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి విడిచి పెట్టారు. ఆర్టీసీ బస్సుల్లో విస్తృత తనిఖీలు చేశారు.

తనిఖీలు చేపడుతున్న పోలీసులు

వారోత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

రూ.15 లక్షలు మెస్ బిల్లు ఎగ్గొట్టిన

భోజనాల సబ్ కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి కొయ్యూరు

జాతీయ రహదారి నిర్మాణంలో భోజనాలకు సంబంధించిన సబ్ కాంట్రాక్టరు గూడూరు నాగ సాయిరామ్, వండిపెట్టిన ఎస్‌కె.ఫాతిమా కుటుంబానికి ఇవ్వాల్సిన బిల్లులు రూ.15 లక్షలు ఎగ్గొట్టి పరారీలో ఉన్నారని, ఆయన నుండి ఆ మొత్తం రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలని టిడిపి, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొయ్యూరు మండలం రామరాజుపాలెం గ్రామానికి చెందిన ఎస్‌కె.ఫాతిమా కుటుంబాన్ని టిడిపి, సిపిఐ నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ హైవే నిర్మాణానికి సంబంధించి భోజనాల సబ్-కాంట్రాక్టరు తీసుకున్న గూడూరు నాగ సాయిరామ్ భోజనాలు వండే పనులు కొయ్యూరు మండలం రామరాజుపాలెం గ్రామానికి చెందిన ఎస్‌కె.ఫాతిమా కుటుంబానికి అప్పగించారని తెలిపారు. కిరాణా షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఫాతిమా కుటుంబం జాతీయ రహదారి పనులు చేసేవారికి భోజనాలు వండిపెట్టారని, దీనికిగాను ఫాతిమా కుటుంబానికి రూ.15 లక్షలు వరకు సబ్ కాంట్రాక్టరు నాగసాయిరామ్ బకాయి పడ్డారని పేర్కొన్నారు. ఈ మొత్తం ఇవ్వకుండా మోసం చేసి పరారీలో ఉన్నారని, దీనిపై నేషనల్ హైవే అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కెడి.పేట, కొయ్యూరు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేసినట్లు, జాతీయ రహదారి అధికారులను వివరాలు అడిగినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి, సిపిఐ నాయకులు దుచ్చరి చిట్టిబాబు, గాడి శ్రీరామ్మూర్తి, గోలిసింగి సత్యనారాయణ, అనిసెట్టి చిరంజీవి, లోత భీమరాజు, కురుజు శ్రీనుబాబు, పొట్టిక సత్యనారాయణ, కుడుముల రాజు, చంద్రరావు, రాజుబాబు, పొత్తూరు దేవుడు, కొర్రు రామూర్తి, నానాజీ, సతీష్ పాల్గొన్నారు.

మణిపాల్ టైగర్స్ విజయం

విశాఖలో సందడిగా ప్రారంభమైన లెజెండ్ టి 20 క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - పిఎం.పాలెం (విశాఖపట్నం)

ఉత్సాహభరితంగా, ఉత్కంఠ భరితంగా సాగిన ఇండియన్ క్యాపిటల్స్ - మణిపాల్ టైగర్స్ టి 20 మ్యాచ్‌లో 4 వికెట్లు మిగిలి ఉండగానే హర్భజన్ సింగ్ సేన మణిపాల్ టెగర్స్ విజయం అందుకుంది. లెజెండ్స్ క్రికెట్ లీగ్ టి-20 తొలి మ్యాచ్ విశాఖలోని పిఎం.పాలెం సమీపంలో ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎసిఎ - విడిసిఎ అంతర్జాతీయ స్టేడియంలో శనివారం జరిగింది. సాయంత్రం ఆరంభమైన ఈ మ్యాచ్‌కు విశాఖ వాసులు తరలివచ్చారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియన్ క్యాపిటల్స్ 20 ఒవర్లలో 9 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. ఓపెనర్‌గా దిగిన కెప్టెన్ గౌతమ్ గంభీర్ 8 బంతుల్లో 17 పరుగులు, రికార్డో పావెల్ 11 బంతుల్లో 14 పరుగులు చేసి అవుటయ్యారు. మూడో స్థానంలో దిగిన భరత్ చిప్పిలి 51 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 65 పరుగులు చేసి రాణించాడు. మిడిల్ ఆర్డర్‌లో దిగిన బెన్‌డంక్ 33 పరుగులు, ఆష్లేయ్ నర్సే 26 పరుగులు చేశారు. మణిపాల్ టైగర్స్‌లో పంకజ్ సింగ్ 2, ప్రవీణ్ గుప్తా 2, హర్భజన్ సింగ్ 1, ఇమ్రాన్ ఖాన్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మణిపాల్ టైగర్స్ జట్టులోని గ్రాండ్ హోమి 35 బంతుల్లో మూడు ఫోర్లు, నాలుగు సిక్సలతో 58 పరుగులు చేసి రాణించాడు. అమిత్ 32 బంతుల్లో మూడు సిక్సలు, మూడు ఫోర్లతో 48 పరుగులు చేశాడు. వీరిద్దరూ రాణించడంతో ఆ జట్టు విజయం సాధించింది.


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

అల్లూరి పోరాట ప్రాంతాలను పరిరక్షించండి

ప్రజాశక్తి-అడ్డతీగల : స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు నడయాడి, పోరాటం సాగించిన ప్రాంతాలను, స్మారక చిహ్నాలను పరిరక్షించుకోవాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు అన్నారు. శనివారం స్థానిక శ్రీవినాయక తాపీ పనివారల సంక్షేమ సంఘం భవనంలో జరిగిన సంఘం రంపచోడవరం డివిజన్ ఆవిర్భావ సభలో ఆయన మాట్లాడారు. అల్లూరి చరిత్రలో ప్రధాన ఘట్టాలు రంపచోడవరం డివిజన్లోనే జరిగాయని, రంపచోడవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్లపై అల్లూరి దాడులు చేశారని చెప్పారు. అడ్డతీగల మండలం పైడిపుట్ట గ్రామం అల్లూరికి ప్రధాన స్థావరంగా ఉండేదని, అక్కడే ఆయన తపస్సు చేసిన కొండ, గిరిజనుల సమస్యల పరిష్కారం చేసే రచ్చబండ ఉందని పేర్కొన్నారు. అనంతరం రంపచోడవరం, మారేడుమిల్లి, గంగవరం, వై.రామవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి నుండి వచ్చిన ప్రతినిధులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం రంపచోడవరం డివిజన్ అధ్యక్షులుగా చోడిశెట్టి సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా వాడపల్లి శేషాచార్యులు, లోతా రామారావు, ప్రధాన కార్యదర్శిగా లంక ప్రసాద్, అధికార ప్రతినిధులుగా దంగేటి సత్తిబాబు, సోమిరెడ్డి రాజు, రామన శ్రీనివాస్, కోశాధికారిగా పోలిశెట్టి అచ్యుత్, న్యాయ సలహాదారులుగా డి.శ్రీధర్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

ఐక్య పోరాటాలతోనే బాక్సైట్ తవ్వకాల నిలిపివేత

ప్రజాశక్తి -కొయ్యూరు : గిరిజనుల ఐక్య పోరాటాల ఫలితంగానే ఏజెన్సీలో బాక్సైట్ ఖనిజం తవ్వకం ఆగిందని సిపిఐ అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దర్శి సతీష్, కూడా రాధాకృష్ణ అన్నారు. మండలంలోని చింతలపూడి పంచాయతీ లొద్దుపాకల గ్రామంలో శనివారం జరిగిన గిరిజన సమాఖ్య మండల మహాసభలో వారు మాట్లాడుతూ మన్యంలో నేటికీ సరైన రహదారులు లేక డోలుమోతలు తప్పడం లేదని, వైద్యం అందక అనేక మంది గిరిజనులు ప్రాణాలు కోల్పోతున్నారని, అయినా పాలకులకు అధికారులకు చీమకుట్టినట్లయినా లేదని పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు వివిధ కారణాలవల్ల ఈ ఏడాది 29 మంది మృత్యువాత పడ్డారన్నారు. జిఒ 3ను రద్దు చేస్తే ఈ ప్రాంతం ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎంపీ జి.మాధవి మొద్దు నిద్ర పోతున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం గిరిజన సమాఖ్య మండల కమిటీ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఇరవాడ దేముడు, రావణాపల్లి ఎంపీటీసీ ఇరవాడ సత్యవేణి, గిరిజన సమాఖ్య మహిళా జిల్లా అధ్యక్షురాలు, రైతు సంఘం నాయకులు డి కనకరాజు, వియ్యపు నానాజీ, మాజీ సర్పంచ్ గుమ్మ రాంబాబు పాల్గొన్నారు.

క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని జాగారంపల్లిలో క్రిస్టియన్ మైనారిటీల ఆత్మీయ సమ్మేళనం, సంక్షేమ సభ శనివారం జరిగింది. ఈ సభకు అల్లూరి జిల్లాలోని 22 మండలాల నుండి పాస్టర్లు, క్రైస్తవ నాయకులు హాజరయ్యారు. ఈ సభలో ముఖ్యమంత్రి సలహాదారులు (క్రిస్టియన్ అఫైర్స్, మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్) డాక్టర్ ఫాదర్ ఎం.బాలస్వామి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పాస్టర్లు, క్రైస్తవ సమాజం అవసరాలు, సమస్యలు గురించి తెలుసుకొని వినతిపత్రాలు స్వీకరించారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవ డాక్టర్ యమ్ నిస్సికుమార్, జనరల్ సెక్రెటరీ జెకర్యా, ఎపి స్టేట్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు బిషప్ ప్రతాప్ సిన్హా, ఎఐసిసి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రైమో జూహాని హలొనేన్, రాష్ట్ర, జిల్లా, మండల క్రైస్తవ నాయకులు పాల్గొన్నారు.